# ఫైనల్ డయాగ్నోసిస్

రాజ్యలక్ష్మి కొలాస్కర్

వీధి తలుపు దబదబ చప్పుడయింది. "వచ్చేశారు రాక్షసులు. అప్పుడే నాలుగయిపోయిందా" విసుక్కుంటూ చేతిలో నవల పక్కకి పడేసి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది మాలతి. కప్పుకున్న దుప్పటి పక్కకితోసి మంచం దిగేలోగా మరోసారి ఉరుములు పడుతున్నట్లు తలుపులు బాదేశారు.

"ఏమిటంత ఖంగారు? ఏవో కొంపలంటుకు పోతున్నట్లు తలుపులు పగలగొడ్తా రెందుకు ?" గుమ్మంలోనే గదమాయించింది పిల్లల్ని.

"మరి నువ్వెందుకంత ఆలస్యం చేస్తావు ? తొందరగా తలుపు తియ్యలేవా ?" ఇంకా గట్టిగా అరిచింది చిన్నిసుధ. స్కూల్ బ్యాగులు ఒక మూలకి షూస్ ఇంకో మూలకి ఎగురుకుంటూ వెళ్ళి పడ్డాయి. స్కూల్ డ్రెస్సులు కుర్చీలమీదికి.

"మమ్మీ ఆకలేస్తోంది. ఏమన్నా పెట్టవా?" తల్లిని చుట్టుకుంది సుధ.

ముందు బాగ్ షూస్ అన్నీ తీసి సరిగా పెట్టు. అలాగేనా పారేసేది ?

"ఊహు ముందు తినటానికేమైనా పెట్టు. తరువాత సర్దుతాను."

"ఫ్రిజ్‌లో బ్రెడ్ వుంది. తినేసి పాలు తాగండి ఇద్దరూ !"

సుధ చేతులు వదిలించుకుని మళ్ళీ బెడ్ రూమ్ వైపుకి దారితీసింది మాలతి.

"మళ్ళీ బ్రెడ్డేనా ! లంచ్ బాక్సులోకూడా బ్రెడ్ జామ్ పెట్టావు. నాకొద్దు. ఇంకేదైనా పెట్టు." మారాం చేసింది సుధ.

"కావాలంటే తిను లేకపోతే నోరు మూసుకుని కూర్చో. ఒకవైపున రోగంతో నేను చస్తుంటే మీకు చిరుతిళ్ళు. మరీ జ్ఞానం లేకుండాపోతోంది మీకు" తలగడ కానుక్కూర్చుని నడుంవరకు దుప్పటి కప్పుకుని సగంలో ఆపేసిన నవల అందుకుంది.

పెద్దవాడు సంజయ్ పాలు తను తాగేసి చెల్లెలి కివ్వబోయాడు. "నాకొద్దు పో" అన్న చెయ్యి తోసేసి ఒక మూల మూతి ముడుచుకుని కూర్చుంది. అలసటతో ఆకలితో అలాగే నిద్రలోకి జారుకుంది. కొంచెంసేపు ఆడుకుని వచ్చి సంజయ్ హోమ్‌వర్క్ పుస్తకాలు ముందేసుకు కూర్చున్నాడు.

"అరే ! సంజా ! చెల్లాయెందుకలా కూర్చుని నిద్రపోతుంది ?" తండ్రి గొంతువిని కళ్ళు తెరిచింది సుధ. దగ్గరగావెళ్ళి ప్రేమగా కూతురును నిమిరాడు. "మంచం మీద పడుకోమ్మా !" తండ్రి లాలనతో సుధ కళ్ళలో చేరుకున్న ముత్యాలు చెంపలమీదికి జారాయి.

"ఎందుకమ్మా ఏడుపు ? ఏమయింది ? నాకు చెప్పు" కూతుర్ని ఎత్తుకుని మాలతి దగ్గర కెళ్ళాడు.

"నాకు చాలా ఆకలేస్తోంది డాడీ ! మమ్మీ బ్రెడ్ తినమంది. మధ్యాహ్నం లంచ్ బాక్సులో కూడా అదే ! నా కిష్టంలేదు. మమ్మీ ఏమీ ఇవ్వలేదు."

"లేనివాళ్ళు లేక ఏడుస్తుంటే ఉన్నవి తిన టానికి మీకు ఇష్టాలు అయిష్టాలు. రెండు రోజులు కడుపు మాడిస్తే తిన్నగా దారిలోకి వచ్చి ఏది పెడితే అది తింటావు." కోపంగా అరిచింది మాలతి. "ఇవాళంతా ఒకటే తల నెప్పి అన్నం కూడా తినాలన్పించలేదు" కణతలు నొక్కుకుంది.

నీరసంతో వాడిపోయిన సుధ ముఖం చూస్తుంటే శ్రీధర్‌కి గుండెలు పిండినట్టయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మాలతితో అన్నాడు. "తలనెప్పయితే ఆ పుస్తకం ఎందుకు చదవటం కళ్ళు మూసుకుని పడుకో ! సుధా ! అమ్మకి ఒంట్లో బాగాలేదు కదా ! అమ్మని విసిగించకు నేను హోటల్‌కి వెళ్ళి నీకు టిఫిన్ తెస్తాను. సరేనా ? ఏం కావాలి ?"

మాలతి ఉత్సాహంగా దుప్పటితీసి పక్కకి పారేసింది.

"ఎలాగూ ఏడు గంటలవుతోంది కదా ! అందరం వెళ్ళి ఏకంగా భోంచేసి వచ్చేద్దాం. మీరు వెళ్ళటం మోసుకురావటం ఇదంతా ఎందుకు ? ఏమంటారు?"

శ్రీధర్ నిట్టూర్చాడు "అనడానికేముంది? తయారవ్వు?"

మాలతి చకచకా ముస్తాబు ప్రారంభించింది.

శ్రీధర్ తనేం తింటున్నాడో కూడా తెలియనంతగా ఆలోచనల్లో మునిగి తేలుతున్నాడు. "పెళ్ళయి ఇన్నేళ్ళయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. వాళ్ళు పెద్దవాళ్ళవుతున్నారు. అయినా మాలతి మాత్రం ఎదగటంలేదు. పెళ్ళయిననాడు ఎంత బాధ్యతా రహితంగా వుండేదో ఇన్నేళ్ళ తరువాత ఈ రోజు అలాగే వుంది. ఇంట్లో పరిస్థితి చూస్తుంటే తనకి రోజు రోజుకీ మనశ్శాంతి కరువైపోతుంది." క్రిందటి శనివారం జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది.

ఆ రోజు వినాయక చవితి. ఊరంతా కళకళ లాడుతోంది. మార్కెట్‌నిండా పూలు, పళ్ళు, పత్రి, వినాయకుడి బొమ్మలు. ప్రతి జంక్షను లోనూ పెద్ద వినాయకుడి విగ్రహం. కొబ్బరాకుల పందిరి క్రింద రికార్డులు. పిల్లలకి ఎక్సైటింగ్‌గా వుంది. మాలతి మాత్రం రోజూలాగే ఏడు గంటలకి నిద్రలేచింది. పూజ ప్రయత్నాలేమీ చెయ్యటం లేదు. సంజయ్‌కి విషయం అర్థం చేసుకొనే శక్తి వచ్చింది. నోరు తెరిచి ఇది కావాలని అడగడు. సుధ ఇంకా చిన్నది. ప్రతి దానికీ మారాం చేస్తుంది. అసహనంగా అరవటం ప్రారంభించింది. "మమ్మీ! నాకు తలస్నానం చేయించు. నేనూ డాడీ మార్కెట్టుకెళ్ళి ఆకులు అవన్నీ తెస్తాం. మన పూజ అందరి పూజకన్నా ముందైపోవాలి."

"సుధా! నువ్వూరికే అరవకు. అన్నయ్య నువ్వు చక్కగా స్నానంచేసి దేవుడి దగ్గిర దీపం పెట్టుకోండి. పూజ గీజ అని నా ప్రాణం తియ్యకండి. నాకు జ్వరమొచ్చినట్టుంది"

"మమ్మీ! మా టీచరేం చెప్పారో తెలుసా! తలంటుకొని కొత్త బట్టలేసుకొని పాలవెల్లి కింద దేవుణ్ణి పెట్టి పెద్దపుస్తకాలు కూడా పెట్టి పూజ చేసుకుంటే చదువు చక్కగా వస్తుందట. అలాగే చేద్దాం మమ్మీ ! పోనీ కొంచెం పాయసం చెయ్యి. అది చాలు. ఉండ్రాళ్ళు అవీ వద్దులే!" బతిమాలింది సుధ.

"అవునమ్మా !" ఆశగా చెల్లెలికి వంత పాడాడు సంజయ్.

మాలతికి మాత్రం పాలవెల్లిని అలంకరించటం, పూజ ఏర్పాట్లు, పిండివంటలు చెయ్యటం ఇవన్నీ ఊహించుకొనేసరికి మామూలు జ్వరం కాస్తా చలిజ్వరమయిపోయింది.

"వెధవ పండగలు ఎందుకొస్తాయో నా ప్రాణం తియ్యడానికి. అయినా వున్నవాళ్ళకే లక్షా తొంభై పండగలు. ప్రతిదానికీ ఆర్భాటం" చిన్నతనంలో తనెంత ఆనందంగా పండగలు గడిపేసిందో మర్చిపోయి హిందూ మతాన్ని కాసేపు మనసులో తిట్టుకుంది.

"చూడమ్మా సుధా ! నువ్వు చిన్నపిల్లలా మారాం చెయ్యకూడదు. నాకు ఒళ్ళంతా నెప్పిగా వుంది. లేస్తే పడిపోతానేమో అన్నంత నీరసంగా వుంది. ఇవన్నీ ఎలా చెయ్యగలను చెప్పు ? దీపావళి పండగ బాగా చేసుకుందాం. ఏం ?"

సుధకి నిరాశ కోపం ముంచుకొచ్చాయి. గట్టిగా అరుస్తూ ఏడవటం ప్రారంభించింది. "నువ్వెప్పుడూ ఇంతే. అస్తమానం జ్వరం, నెప్పి అంటావు. అంతా పుట్టిందే !"

ఇంతలో ఎదురింటి సుభద్ర వచ్చింది.

''మాలతీ! మీ ఇంట్లో గంధంచెక్క వుంటే ఇస్తావూ? ఏమయింది సుధా! ఎందుకూ ఏడుస్తున్నావూ?''

''చూడు సుభద్రా! ఇది వయసుకెదుగుతోందికానీ బుద్ధి మాత్రం పెరగట్లేదు. పూజ ఆర్భాటంగా చెయ్యమని నా ప్రాణం తినేస్తోంది. నాకేమో విపరీతమైన తలనెప్పి. జ్వరం కూడ తగినట్లుంది. దీనికి చెప్తే వినటంలేదు.''

''అయ్యో పాపం! అయినా ఎప్పుడూ తలనెప్పి అంటావుమరి డాక్టరుకి చూపించుకోరాదూ!''

వినడానికి ఎవరు దొరికినా మాలతి తనకున్న రోగాలన్నిటినీ ఏకబిగిని ఏ కరువు పెట్టేస్తుంది. అందుకే ఆ కాలనీ వాళ్ళంతా మాలతితో ఆరోగ్యం విషయం ఎత్తకుండా జాగ్రత్త పడతారు. సుభద్రవాళ్లొచ్చి కొద్ది కాలమే అయింది.

''అన్నీ అయ్యాయి సుభద్రా! కళ్ళు పరీక్ష చేయించుకున్నాను. ఎక్స్‌రే తీయించుకున్నాను. ఏం లేదంటారు డాక్టర్లు. నాకు మాత్రం సైనుసైటిస్ అని అనుమానం. పోనీ అదొక్కటే అయితే ఎలాగో నెట్టుకొచ్చేదాన్ని. ''స్పాండిలైటిస్'' మూలంగా మెడ ఒకటే నెప్పి. ఈ మధ్య కాళ్ళు సలపటం మొదలెట్టాయి. ''సయాటికా'' అని భయమేస్తోంది. రేపో ఎల్లుండో డాక్టరు దగ్గరకెళ్ళాలి.''

''ఒక పనిచెయ్యి మాలతీ! పిల్లల్నిద్దర్నీ మా ఇంటికి పంపించు. పూజ చేసుకుని భోంచేసి వస్తారు. వాళ్ళ ముచ్చటా తీరుతుంది నీకు విశ్రాంతీ.''

మాలతి రిలీఫ్‌గా నిట్టూర్చింది. సుభద్ర వెళ్ళగానే శ్రీధర్‌కోసం తనకోసం స్టవ్‌మీద కుక్కర్ పడేసి పేషెన్స్ ఆడుకోవటం మొదలెట్టింది. పండుగ పూట పాచి ఇల్లు ఊడ్చుకుందామన్న జ్ఞానంకూడా లేకపోయింది. పని మనిషి పండగమూలాన రాలేదు.

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సుభద్ర పిల్లల్ని తీసుకొచ్చింది.

''మాలతీ! ఎలావుందిప్పుడు?''

''అదే వుండటంలే సుభద్రా! ఒళ్ళంతా రోగాలపుట్టై పోయింది. నా సంగతికేమొచ్చె గాని వీళ్లు నిన్నేమైనా విసిగించారా?''

''ఛ! ఛ! ముత్యాల్లాంటి పిల్లలు విసిగించటమా ఏమన్నానా? అన్నట్టు నీకు చెప్పటం మరిచిపోయాను. ఇవాళ మన ఆడిటోరియంలో మురళీకృష్ణ సినిమా వేస్తున్నారట. నీకు పాత సినిమాలంటే ఇష్టం కదూ! తీరా వచ్చేసరికి...''

''ఆ సినిమా చాలా బాగుంటుంది సుభద్రా! ఎన్నాళ్ళనుంచో చూడాలనుకుంటుంటే కుదరనే లేదు. నానెప్పులు ఎప్పుడూ వుండేవేకదా! రెండు టాబ్లెట్లు మింగి వస్తాను. ఎన్నింటికి సినిమా?''

పది నిమిషాల్లో తయారైపోయి ఇల్లు పిల్లల్ని భర్తకప్పగించేసి సినిమాకి వెళ్ళిపోయింది మాలతి.

* * *

''సార్!'' గట్టిగా పిలిచాడు సర్వర్. ఉలిక్కిపడ్డాడు శ్రీధర్. ''ఏమిటండీ ఆ పరధ్యానం! రెండుసార్లు వచ్చాడతను అడగటానికి. ఏ లోకంలో వున్నారు?'' మాలతి కోప్పడింది.

భోజనాలు ముగించి ఇంటికి చేరుకున్నారు.

* * *

ఓ రోజు శ్రీధర్ ఇంటికి వచ్చేసరికి సుధ ఓ మూల ఏడుస్తూ కూర్చుంది. అసలు చూడగానే సుధ అని గుర్తుపట్టలేదు. ''డాడీ!'' అంటూ వచ్చి చుట్టుకోగానే ఆశ్చర్యంగా చూశాడు కూతురివంక. సుధకి చక్కటి జుట్టుండేది. ఒత్తుగా నల్లగా పొడవుగా వున్న జుట్టుని రెండు జడలేసుకుని స్కూల్‌రూల్ ప్రకారం తెల్లటి రిబ్బన్లేసుకొంటే చూడ ముచ్చటగా వుండేది. అలాటిది ఇవాళ పొట్టిగా అటు బాబ్ కాకుండా, ఇటు క్రాఫ్ కాకుండా కత్తిరించేసి వుంది. సుధకి చాలా యాసగా వుంది. అందులోనూ సుధ కొంచెం కాలుబారు పిల్ల కావటంతో మరీ వికారంగా వుంది. కోపంగా అడిగాడు ''ఎందుకు కట్ చేసుకున్నావిలా?''

సుధ వెక్కుతూ చెప్పింది. ''ప్రొద్దున్న మమ్మీ కట్ చేసింది నేను వద్దన్నా సరే! స్కూల్లో అందరూ నన్ను చూసి నవ్వుతున్నారు. ''ఈకలు పీకిన కోడి'' అని వెక్కిరిస్తున్నారు. రేపట్నుంచీ నేను స్కూలుకి పోను.''

నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" :— ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6—30 గం. వరకు. ప్రతినెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

**డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,**

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521 301 ★ ఫోన్స్ : 522 & 540.



**నిరోధ్‌తో...**
**తొలి బిడ్డ పుట్టేముందు,**
**మధుర క్షణాల సుఖ, సంతోషాలను**
**అనురాగంతో పంచుకోండి**



మీకు అవశ్యంగా
తోచినప్పుడు
మీరు ఏకత్వంలో
తన్మయంచెంద
సహకరించగలదు
నిరోధ్. తొలి బిడ్డ
యీ మహత్తరమైన
ప్రకృతి ప్రపంచంలో
కనులు తెరచి కాలిడ,
మీ కోరికకు
అనువుగా తగిన
కాల వ్యవధిని,
అవకాశాన్ని
సమకూర్చగలదు.




**నిరోధ్ వాడండి**
సుఖప్రదమైన, నిశ్చింతయైన
వైవాహిక జీవితానికి

డిస్ట్రిబ్యూటర్లు బ్రూక్ బాండ్, లిప్టన్, హిందూస్థాన్ లీవర్, ఐ టి సి, టాటా ఆయిల్ మిల్స్, యూనియన్ కార్బైడ్, ఐడిపిఎల్, స్మిత్ స్టానిస్ట్రీట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం మరియు అరసన్ మ్యాచ్ ఇండస్ట్రీస్.

davp 84/2


# ఫైనల్ డయాగ్నొసిస్

'మాలతీ!' గర్జించాడు.

బాల్కనీలోంచి క్రింద ఇంటి వాళ్లతో కబుర్లాడుతున్న మాలతి గబ గబ వచ్చింది. ఏడుస్తున్న సుధనీ కోపంగా వున్న శ్రీధర్‌నీ చూడగానే విషయం అర్థమైపోయింది.

"ఎందుకండీ అలా అరుస్తారు? ఇంట్లో అడుగు పెట్టగానే ముద్దుల కూతురు చాడీలు చెప్పటం మీరు వినటం. ఇంకేంపనిలేదు."

"అరవక ముద్దు పెట్టుకోమంటావా? దాని జుట్టెందుకలా కట్‌చేశావు?"

"శీతాకాలం వస్తోంది కదా! నాకు "ర్యుమాటిజం" మూలాన కీళ్లనొప్పి రోజు రోజుకీ ఎక్కువవుతోంది. జడ వెయ్యటానికి వేళ్లు వంగట్లేదు. వారం వారం తల రుద్దేసరికి నడుం విరిగినంత పనవుతోంది. ఇప్పుడు దానికే మాత్రం వయసయిపోయిందని, రెండు మూడేళ్లలో అదే పెరుగుతుంది. ఎందుకంత రాద్ధాంతం?"

"ఆడదానివయ్యుండీ అంత అందమైన జుట్టు కత్తిరించటానికి నీకు చేతులెలా వచ్చాయి? నీకంత బాధగా వుంటే, నాతో చెప్పాల్సింది నేను చేసేవాణ్ణి. చేసే పనులన్నిటిలో ఇదీ ఒకటయ్యేది. ప్రతి చిన్నపనికీ అరవైఆరు రాగాల లిస్టు చదవటం నీకు బాగా అలవాటైపోయింది."

"అనుభవించే వాళ్లకి తెలుస్తుందండీ! నా బాధ మీకెలా అర్ధమవుతుంది? ఎన్ని మాటలైనా అంటారు. అనండి. ఏంచేస్తాను? నా ఖర్మ" ముక్కు చీదింది మాలతి.

వెంటనే తగ్గిపోయాడు శ్రీధర్. సుధ వైపుకి తిరిగి బుజ్జగింపుగా అన్నాడు "సుధా! బంగారు తల్లివి కదూ! పేచీ మానెయ్యి. నీకు అందమైన పిన్నులు, హెయిర్ బాండ్స్ కొంటాను. అవి పెట్టుకుంటే ఎంచక్కా ముద్దొస్తావు. అప్పుడు ఎవళ్లు నవ్వరు" సుధ అయిష్టంగానే నీళ్లు తుడుచుకుంది.

శ్రీధర్ ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. వక్రీ పడుతున్నట్లు నుదుటిమీద చర్మం ముడుతలుపడింది. ఒక పావుగంట తరువాత ఏదో నిర్ణయానికొచ్చినట్లు తల పంకించి లేచాడు.

"మాలతీ! నేను బయిటికెళ్తున్నాను. రావడానికి లేట్ కావచ్చు. నాకోసం చూడకు."

ప్రాణస్నేహితుడైన చక్రపాణి క్లినిక్‌కి వెళ్ళాడు. చక్రపాణి పట్టణంలో మంచి పేరున్న డాక్టరు. తను వచ్చానని బయట వెయిట్ చేస్తున్నానని — నర్స్‌తో నోట్ పంపించగానే చక్రపాణి బయటికి వచ్చేశాడు. శ్రీధర్‌ని ఆప్యాయంగా భుజమ్మీద చరిచాడు. "ఇడియెట్!

సరాసరి లోనికి రాక స్ట్రెయిల్‌గా నోట్ పంపిస్తావా ?''

"పేషెంట్స్‌ని చూస్తుంటే డిస్టర్బ్ చెయ్యటం ఇష్టముండదురా! నీవు ఆ పని పూర్తి చేసుకో! నీతో కొంచెం మాట్లాడాలి.''

"అయితే నువు నా రెస్ట్ రూమ్‌లో కూర్చో. వీళ్ళందర్నీ త్వరత్వరగా పంపేస్తాను. ఈ మేగజైన్స్ చూస్తుండు.''

అరగంటలో వచ్చాడు. "ఇప్పుడు చెప్పు.''

"నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి చక్రీ! అర్జెంటు పనేమీ లేదుకదా !''

"నీకంటే అర్జెంటేమీ కాదుకానీ చెప్పు.''

"మాలతి గురించి...''

"ఏమయింది మాలతికి ? ఒంట్లో బాగా లేదా ? మరెందుకు తీసుకురాలేదు ?'' ఆత్రంగా అడిగాడు.

"మాలతిని చూస్తుంటే నాకు మతి పోతుందిరా ! తను వాళ్ళింట్లో చాలా గారాబంగా పెరిగింది. దాంతో విపరీతమైన బద్ధకం. పెళ్ళయి సంసారం ఏర్పడినా ఆ బద్ధకం ఒదుల్చుకోలేకపోతోంది. పిల్లలు పుట్టేవరకూ ఏదో గడిచిపోయింది. ఆ తరువాత రోజు రోజుకీ నరకమయిపోతోంది. పనిమనిషి ఎలాగూ వుంది. వంటమనిషి కూడా కావాలంది. నానా అవస్థలూపడి పెట్టుకుంటే వాళ్ళు రెండు మూడు నెలలుండటం చేతికందింది పట్టుకుని పారిపోవటం. రెండేళ్ళు ఇలా గడిచాక ఏమైనా వంటమనిషి ఉండటానికి వీల్లేదన్నాను. కొన్నాళ్ళు సాధించింది. నేను పట్టించుకోలేదు. క్రమక్రమంగా ఈ జబ్బుని ఆ జబ్బుని వడ కెయ్యటం ప్రారంభించింది. అప్పట్లో నాకు అనుమానం రాలేదు. రోగాల పేర్లన్నీ ఎలా తెలుసుకుందో సైనుసైటిస్ అంటుంది. ర్యుమాటిజం అంటుంది. ఎనీమియా మైగ్రైన్ ఇంకా ఏమిటేమిటో ! డాక్టర్ల చుట్టూ తిరిగి విసుగొచ్చేస్తోంది. అన్ని టెస్ట్‌లు అయ్యాయి. ఏం తేలక చివరికి ఏదో ఇన్ఫెక్షన్ అని యాంటి బయాటిక్స్ విటమిన్స్ ఇచ్చేవారు. ఇల్లు ఒళ్ళు గుల్లయిపోతోంది. కాని తనకి మాత్రం రిలీఫ్ లేదు. ఇవాళేం చేసిందో తెలుసా ? కీళ్ళనొప్పు లొస్తున్నాయి. జడ వెయ్యలేకపోతున్నానని సుధ జుట్టు కత్తిరించేసింది. అది ఏడుస్తూ కూర్చుంది. నాకేమీ పాలుపోవట్లేదు. గట్టిగా కేకలేద్దామంటే నిజంగానే ఒంట్లో బాగా లేదేమోనని మనసు పీకుతుంది. మరో చెంప ఇందరు డాక్టర్లకి ఇన్ని టెస్ట్‌లకి అందని రోగ మేముంటుందా అనిపిస్తుంది. సుధ హోమ్ వర్క్‌లో హెల్ప్ చెయ్యమ్మా అంటే చచ్చి పోతున్నాను బాబోయ్ అని మొత్తుకుంటుంది. అంతలోనే ఎవరైనావస్తే గంటల తరబడి కబుర్లు చెప్తుంది. సినిమాలకెళ్తుంది. డాక్టరు దగ్గరకనే మిషతో అట్నుంచటు హోటల్స్ కెళ్దామంటుంది. ఏం చెయ్యాలో తోచక నీ సలహాకోసం వచ్చానురా !'' ఇన్నేళ్ళు ఎవరితో చెప్పుకోలేని ఆవేదనని వెళ్ళబోసుకున్నాడు.

"ఏరా ! ఇన్నేళ్ళుగా బాధపడుతూ ఇప్పుడా నా దగ్గరకి రావటం ? నేను చచ్చిపోయాననుకున్నావా ?''

"ఛ ! ఛ ! అవేం మాటలురా ! స్నేహాన్ని స్వార్థానికి వాడుకున్నట్లువుతుందని రాలేదురా ! అంతేకాని మరేంకాదు.''

చక్రపాణి ఆలోచనలో పడ్డాడు. బరువు దించుకొన్న రిలీఫ్‌తో కుర్చీలో వెనక్కు వాలి కళ్ళు మూసుకున్నాడు శ్రీధర్.

పావుగంట తరువాత అన్నాడు. నువు రేపు సాయంత్రం మాలతిని ఇక్కడికి తీసుకురా! నేను కూడా ఒకసారి చెక్‌చేసి చూస్తాను. ఏదైనా సుస్తీవుంటే మంచి ట్రీట్‌మెంట్ ఇద్దాం. నీ అనుమానం నిజమయితే మాలతిని ఒక్క నెల రోజుల్లో నార్మల్‌గా తయారు చేస్తాను, నువు మాత్రం మనసు గట్టి బరుచుకుని నాకు పూర్తిగా కోపరేట్ చెయ్యాలి.

"నువ్వెలా చెప్తే అలా చేస్తానురా! చెప్పు''

ఒక అరగంటసేపు చర్చించుకొన్నాక ఇంటి ముఖం పట్టాడు శ్రీధర్.

మర్నాడు మాలతిని తీసుకుని నర్సింగ్ హోమ్‌కి వచ్చాడు శ్రీధర్. మాలతిని పూర్తిగా చెక్ చేశాడు చక్రపాణి. అప్పటివరకు తీసిన ఎక్స్‌రేలు, చేసిన టెస్ట్ రిపోర్టులు, వాడిన మందుల వివరాలు అన్నీ జాగ్రత్తగా చూశాడు. చివరికి శ్రీధర్‌తో అన్నాడు "ఒరేయ్! మాలతికి పెద్దగా భయ పడాల్సిన జబ్బేమీలేదు. అలా అని పూర్తిగా నిర్లక్ష్యం చెయ్యకూడదు. నేను మందులు వ్రాసి ఇస్తాను. అవి వాడినంత మాత్రాన సరిపోదు. తనకి పూర్తిగా విశ్రాంతి అవసరం. ఇంటి దగ్గరుంటే అది కుదరదు. నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్‌చేస్తే బాగుంటుంది. ఒక ఇరవైరోజులు పిల్లల్ని మానేజ్ చెయ్య గలవా?''

"మానేజ్ చెయ్యడానికేముందిరా? పిల్లలు మరీ చిన్న వాళ్ళేమీ కాదు. అందులోనూ చెప్తే అర్థం చేసుకొనే శక్తి వుంది. నువ్వెలా చెప్తే అలా!''

"అయితే రేపొచ్చి అడ్మిట్ అయిపోమ్మా, ఓ. కే ?''

మాలతి కళ్ళు ఆనందంగా మెరిశాయి. చాకిరీ తప్పటమే కాకుండా మహారాణిలా అన్ని సపర్యలూ జరుగుతాయి. ఎంచక్కా పుస్తకాలు చదువుకుంటూ చూడవచ్చేవాళ్ళతో కబుర్లు చెప్తూ...

పంచరంగుల కల కళ్ళముందు నిలిచింది. అందరు డాక్టర్లకన్న చక్రపాణి బెస్ట్ డాక్టర్ అని తీర్మానించేసి ఆ విషయం శ్రీధర్‌తో చెప్పింది.

* * *

రోజు రోజుకి మాలతి పంచవన్నెల కలల రంగులు మాసిపోతున్నాయి. మొదటి రోజు స్వర్గంలో వున్నట్లు ఫీలయింది. నర్స్ మూడు పూటల భోజనం, మందులు అన్నీ ఇచ్చేసి వెళ్తుంది. డాక్టర్ సాయంత్రం వచ్చి చూసి వెళ్ళాడు. రెండోరోజు ముగిసేసరికి కొంచెం విసుగు కోపం బాధ అన్నీ కలిగాయి. ఇదేమిటి ? అంతా తను అనుకున్నదానికి విరుద్ధంగా జరుగుతోంది ? ఎవళ్ళు చూడటానికి రారు. స్నేహితులు పిల్లలు శ్రీధర్ ఎవ్వరూ ! ఆ సాయంత్రం చక్రపాణిని అడిగింది. "అన్నయ్యగారూ ! ఆయన చూడటానికైనా రావట్లేదు. హాస్పిటల్లో అడ్మిట్ చెయ్యగానే పీడ వదిలిపోయినట్టుందేమో ఆయనకి! మీరు కొంచెం ఫోన్‌చేసి చెప్పండి'' గొంతులో నిండుగా నిష్ఠూరం !

"నేనే రావద్దని చెప్పానమ్మా ! నువు శారీరకంగానేకాక మానసికంగాకూడా విశ్రాంతి



# ఆటపాటల్లో మా బుజ్జాయికి లేదు సాటి, చూడండి వీడి బట్టల తెలుపు

**నీలి 卐 స్వస్తిక్ డిటర్జెంట్ ఉతికే బార్**

ఒక మారు స్వస్తిక్ బార్... మరి ఎల్లప్పుడూ స్వస్తిక్ బార్

Shilpi DM 7/84 Tel




తీసుకోవాలి. మనశ్శాంతి లేనప్పుడు ఎన్నిమందులు వాడీ ప్రయోజనంలేదు. శ్రీధర్‌గాని పిల్లలుగాని వచ్చినప్పట్నుంచీ ఏదో ఒక విషయం గురించి వర్రీ అయిపోతావు. అందుకే ఎవర్నీ రావద్దన్నాను. మనసు ప్రశాంతంగా వుంచుకున్నావంటే త్వరగా నయమయిపోతుంది.''

వారం రోజులయ్యేసరికి పిచ్చెక్కినట్టయిపోయింది. న్యూస్ పేపరు తప్ప ఒక్క పుస్తకం దొరకదు. పనీపాట లేక పగలూ రాత్రీ నిద్రపోదామన్నా రావట్లేదు.

ఒకసారి నర్స్‌ని పట్టుకుని కబుర్లలోకి దించాలని చూసింది. మర్యాదగా తప్పించుకుంది నర్స్. ఆలోచనలే తోడయ్యాయి. మెల్లమెల్లగా ఏదో అర్థం అయి అవనట్టుంటోంది మాలతికి.

పన్నెండు రోజులయ్యేసరికి మరి నిగ్రహించుకోలేకపోయింది. సాయంత్రం చక్రపాణి రాగానే నిలదీసింది. ''అన్నయ్యాగారూ! నిజం చెప్పండి. నాకున్న రోగమేమిటో ? కాస్తో కూస్తో చదువుకున్నదాన్ని. మీరు చెప్తే అర్థం అవకపోదు ''

చక్రపాణి మౌనంగా వుండిపోవటంతో మళ్ళీ అంది – ''నాకేదో అనుమానంగా వుంది. మీరు ఆయన కలిసి ఏదో నాటకమాడుతున్నట్లనిపిస్తోంది. నా బద్ధకం కప్పిపుచ్చుకోవటానికి రోగం వంక పెడుతున్నానని ఆయన మీకు ముందే చెప్పారు అవునా ?''

''శ్రీధర్ అలా చెప్పాడనే అనుకుందాం. ఆత్మవంచన చేసుకోకుండా చెప్పు అతని అనుమానం నిజమేనా ?''

మౌనంగా ఉండిపోవటం ఈసారి మాలతి వంతయింది. ఆఖరికి అంది ... ''చెకప్ చేసిన రోజే ఈ విషయం నాతో ఎందుకు చెప్పలేదు?''

చక్రపాణి సీరియస్‌గా అన్నాడు ''మాలతీ! శ్రీధర్ నాతో మాట్లాడినప్పుడే నాకు ఈ అభిప్రాయం కలిగింది. అది డైరెక్టుగా చెప్పానంటే నీకు నచ్చదు. ఈయనకేం తెలియదు. ఇంకో మంచి డాక్టరు దగ్గరకెళ్దామంటావు. అసలు ఈ రోజుల్లో డాక్టర్లకొచ్చే సగం కేసులు నీలాటివే ! ఏ డాక్టరైనా నిజం చెప్తే ప్రాక్టీసు పోవటం తప్ప ప్రయోజనముండదు. ఎందుకంటే నీలాంటివాళ్ళు వెంటనే ఇంకో డాక్టరు దగ్గరకెళ్తారు. అందుకే ఏదో ఒక పేరు చెప్పి రకరకాల పాథలాజికల్ టెస్ట్‌లు అవసరం ఉన్నా లేకపోయినా చేయించి నాలుగు రకాల మందులు ఇస్తేకాని పేషెంట్లని చెప్పుకునే మీకు తృప్తి వుండదు. నువు ఒక మామూలు పేషెంట్‌వయితే నేను అదే చేసేవాణ్ణి. కాని శ్రీధర్ భార్యవి. నాకు చెల్లెలుతో సమానం. నేను చెప్పేకంటే నీకై నువు తెలుసుకోవాలని ఇలా చేశాము. ఇలాగైతే ఇవాళ కాకపోతే రేపు

# స్వయం ఉపాధి పథకం చేపట్టిన మహిళా మెకానిక్ - కుమారి జ్యోతిర్మయి

ఈనాడు మన సమాజంలో మహిళలు అన్ని రంగాలలోనూ ముందడుగు వేయడం, సమాజంలో పురుషుడితో పాటు సమానంగా స్త్రీ కూడా అన్ని హక్కులను పొందడమేకాకుండా అలనాటి నుండి కూడా కొందరు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. కొన్ని పనులు చేయడం, కొన్ని పదవులు కేవలం పురుషులే నిర్వహించగలరు, చేయగలరు అన్నది ఆనాటిమాట. నేడు చాలామంది మహిళలు కూడా పురుషులకు తీసిపోని విధంగా అన్నిరంగాలలోకి ప్రవేశించి కృతకృత్యులవుతున్నారు.

## మరో ముందడుగు !

ఇందుకొక మచ్చుకగా మెకానిజమ్ వృత్తి చేపట్టి ఆత్మస్థయిర్యంతో సాటి పురుషులతో పాటు పోటీకి తట్టుకొని జీవనం సాగిస్తున్న కుమారి జ్యోతిర్మయి మరో అడుగు ముందుకేసిందని చెప్పకోవచ్చు.

కుమారి సయింపు జ్యోతిర్మయి ఒక పేద కుటుంబంలో పుట్టింది. తల్లి లైబ్రేరియన్, తండ్రి ఒక పొగాకు కంపెనీలో చిన్న ఉద్యోగి. జ్యోతిర్మయి తన తల్లితండ్రులు ఇచ్చిన చొరవ, ఉత్సాహము, కృషి వలన యస్. యస్.సి. ప్రథమశ్రేణిలో పాసయింది. పై చదువులు చదివినా ఉద్యోగం వస్తుందనే ఆశలేక హైదరాబాదులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఇన్స్టిట్యూట్‌లో చేరి రేడియో మరియు టెలివిజన్‌లో డిప్లమా పొందింది.

అనంతరం ఆమె ఉద్యోగం కోసమై ఆ కంపెనీకి, ఈ కంపెనీకి దరకాస్తులు పెట్టి, పెట్టి విసిగి వేసారిపోయి, స్వతంత్రంగానే జీవించాలనే సంకల్పంతో సొంతంగానే షాపు పెట్టుకోవాలని నిశ్చయించుకొన్నది. అదృష్టవశాత్తు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కంచికచర్ల, ఉమెన్స్ వెల్‌ఫేర్‌వారు ఆర్థికసహాయం చేయగా ఆమె కృష్ణాజిల్లా కంచికచర్లలో రేడియో, టి. వి. సర్వీసింగ్ షాపుని ప్రారంభించింది.

## స్త్రీకి ఆత్మస్థయిర్యం ముఖ్యం

ఈ వ్యాస రచయిత అడిగిన కొన్ని ప్రశ్నలకు ఆమె సమాధానం చెబుతూ స్త్రీకి ఆత్మస్థైర్యం, పట్టుదల ముఖ్యమని ఆమె అన్నది. ముందు, ముందు సాటి స్త్రీలకు ఈ విద్యను నేర్పుతారా అన్నప్రశ్నకు సమాధానంగా ఎవరైనా సరే వచ్చి శ్రద్ధగా నేర్చుకుంటానంటే నాకు ఎలాంటి అభ్యంతరము లేదని, అనుభవముగడించి ఆర్థికంగా బలపడిన తరువాత రేడియో, టి. వి. ఇన్స్టిట్యూట్‌ని భవిష్యత్తులో ప్రారంభించనున్నట్లుగా ఆమె అన్నది. ఆడవాళ్ళు "సర్వీసింగ్ షాపులు" ప్రారంభించడం చాలా అరుదుకదా? అలాంటప్పుడు ఇలాంటి ఆలోచన ఎలా వచ్చింది? అన్నప్రశ్నకు మా తల్లితండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం, స్వతహాగా నాకున్న ప్రీతి, ప్రముఖ వ్యాపారస్తులు అయినటువంటి శ్రీ దమ్మాలపాటి అప్పారావుగారి చేయూత వలన ప్రారంభించినట్లుగా ఆమె అన్నది. మరి కొన్ని ప్రశ్నలకు సమాధానంగా సాటి వృత్తుల వారయిన పురుషులనుండి ఎలాంటిప్రోత్సాహమూ లేదని, మహిళా మెకానిక్ అయినందువల్ల చాలా చులకనగా చూస్తున్నారని ఆమె బాధగా అన్నది. అయినా లెక్కచేయక సమాజంలో ఆటుపోట్లను తట్టుకొని సాటి వ్యాపారములో సముచిత స్థానం సంపాదిస్తానని ఆమె దృఢంగా చెప్పింది. అందుకు కారణం తోటిమెకానిక్‌లకి తీసిపోకుండా పాడయిన ఎటువంటి రేడియో, టి. వి.లయినా రిపేయర్ చేయగలనని ఎంతో కార్యదీక్షతో చెప్పింది.

## వరకట్నం అనాగరికం

ప్రస్తుత వివాహవ్యవస్థ గురించి అడిగిన ప్రశ్నకు సమాజంలో అన్ని రంగాలలో పురుషుడితో పాటు స్త్రీ కూడా అభివృద్ధి చెందినప్పటికి ఇంకా పురుష ఆధిక్యత వ్యక్తపరుస్తూ వరకట్నం తీసుకోవడం చాలా అనాగరికమని ఆమె అన్నది.

కుమారి జ్యోతిర్మయిని విద్యావంతులయిన ప్రతి యువతి, యువకులు ఆదర్శంగా తీసికొని తమ, తమ కాళ్లమీద తాము నిలబడ గలిగినప్పుడే ప్రస్తుతం సమాజంలో కారుమబ్బుల్లా అలుముకొని వున్న నిరుద్యోగ సమస్య సగమయినా పరిష్కారం కాగలదని వేరే చెప్పనవసరము లేదు.

**-యస్. మనోహర్**

ఆలోచనల్లో పడక తప్పదు. అప్పుడు నిన్ను నువు మభ్యపెట్టుకొని బాధ్యతలనుంచి ఎలా పారిపోతున్నావో గ్రహింపుకి తప్పనిసరిగా వస్తుంది. శ్రీధర్ పిల్లల సంగతి అలా వుంచు. ఈ విధంగా నాటకం ఆడటంవల్ల నీకు నువు ఎంత హాని చేసుకుంటున్నావో తెలుసా ! ఈ రోజుల్లో వచ్చే మందు లన్నిటికి సివియర్ సైడ్ ఎఫెక్ట్సు వుంటున్నాయి. అవసరంలేని మందులు మింగటం శరీరానికి ఎంత హానికరమో మాటల్లో చెప్పలేం. ఇలాగే ఇంకో రెండు మూడేళ్ళు కంటెన్యూ చేశావంటే హైపో కాండ్రియక్‌గా తయారవుతావు. ఆ అలవాటు మాన్పించటానికి సైకియాట్రిక్ ట్రీట్‌మెంటు అవసరమవుతుంది.

మాలతి కళ్ళు భయంతో పెద్దవయ్యాయి. "అన్నయ్యగారూ! ఈ విషయాలన్నీ ఆలోచించలేక పోయాను. మిడిమిడి జ్ఞానం అనర్థదాయకమని నాలాంటివాళ్ళని చూసే అని వుంటారు. దయచేసి ఇంటికి పంపించెయ్యండన్నయ్యా ! ఎంత అవస్తపడుతున్నారో పాపం ! ఆయన ముఖం ముఖ్యంగా పిల్లల ముఖం చూడాలంటే సిగ్గుగా వుంది. అయినా తప్పదుకదా !"

చక్రపాణి సంతృప్తిగా చిరునవ్వు నవ్వాడు. ఇదంతా గుర్తుపెట్టుకుని "అతివృష్టి అనావృష్టి" సామెతగా చెయ్యకు సుమా ! నిజంగా ఏదైనా అనారోగ్యం వుంటే మాత్రం వెంటనే వచ్చెయ్యి. ఇప్పుడే శ్రీధర్‌కి ఫోన్ చేస్తాను.

తేలికయిన మనసుతో రూమ్‌లో వున్న తన వస్తువులన్నీ సర్దుకుని శ్రీధర్ కోసం, పిల్లల కోసం ఎదురుచూడసాగింది మాలతి. ★